క్లుప్తంగా

కాలభైరవ హోమానికి తరలిరండి



అమలాపురంలో పతాక ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక ఆదిశేష నిలయంలో గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో కాల భైరవాష్టమి సందర్భంగా ఈ నెల 22, 23 తేదీల్లో కాల భైరవ అఖండ హోమం, పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి సలాది సాయిరామ్ తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు కాల భైరవ హోమం ప్రారంభమైందన్నారు. 23వ తేదీ రాత్రి 9 గంటలకు జరిగే పూర్ణాహుతితో హోమం ముగుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ నగర్‌లో డాగ్‌స్టార్ పతాక ధ్వజాన్ని అక్షయ పాత్ర ప్రతినిధులు రవణం కుమార్, నాగ కృష్ణవేణి దంపతులు ఆవిష్కరించారు. 3,890 కొబ్బరి కాయలతో హోమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. హోమాన్ని తిలకించేందుకు భక్తులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

స్పేస్ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత సైంటిస్టు యాళ్ల శివప్రసాద్

ముమ్మిడివరం: విశ్రాంత ఇస్రో సైంటిస్ట్ యాళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాకెట్ ప్రయోగాలు, స్పేస్ సైన్స్‌పై అవగాహన కల్పించారు. ముమ్మిడివరం తారా జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. రాకెట్ ప్రయోగాలపై ఎదురయ్యే సమస్యలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేస్తూ వారి ప్రతిభను పరీక్షించారు. విశ్రాంత ఇస్రో సైంటిస్టు శివప్రసాద్ దంపతులను కళాశాల కరస్పాండెంట్ సుమంత్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేవీఎల్ నరసింహారావు, విత్తనాల వరప్రసాద రావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

తాళ్లరేవు: ప్రభుత్వం సాధారణ విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో దీనిని ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం పార్టీ మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు వినియోగదారులు నెల పూర్తయిన తరువాత బిల్లులు చెల్లిస్తున్నారని ఆలస్యం అయితే ఫైన్‌తో చెల్లించే వారన్నారు. కానీ స్మార్ట్ మీటర్‌లు ఏర్పాటయితే రీచార్జ్ చేసుకొని వినియోగం చేయాల్సి ఉంటుందని అది ఎప్పుడు అయిపోతే అప్పుడు విద్యుత్ నిలుపుదల చేస్తారని వెల్లడించారు. విద్యుత్ వినియోగ సమయాలను బట్టి ధర నిర్ణయిస్తారని దీనివల్ల బిల్లులు పెరిగి ప్రజలకు భారంగా మారుతుందన్నారు.

ఇంజినీరింగ్ ఉద్యోగుల సమ్మె వాయిదా

అమలాపురం రూరల్: తమ డిమాండ్ల సాధన కోసం అమలాపురం మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ డోర్, ఇండోర్ సిబ్బంది చేపట్టిన సమ్మె బుధవారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అమలాపురం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఇంజినీరింగ్ వర్కర్ల యూనియన్ కమిటీ సభ్యులు, అధికారుల మధ్య జరిగిన చర్చల్లో డిమాండ్ల పరిష్కారానికి రెండు నెలల గడువు కోరడంతో సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు యూనియన్ కమిటీ సభ్యులు తెలిపారు.

విఘ్నేశ్వరునికి సంకటహర చతుర్థి పూజలు



పుష్పాలంకరణలో విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం సంకటహర చతుర్థి పూజలు జరిపారు. స్వామికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 1680 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. స్వామికి బుధవారం ఒక్క రోజు రూ.2,78,049 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

వ్యవసాయం పెట్టుబడి ఏదీ..!

- అన్నదాతలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ
- ఆరు నెలలు దాటుతున్నా అతీగతీ లేదు
- దాళ్వాసాగుకు అప్పులే శరణ్యం



పోలేకుర్రు పంచాయతీలో ముమ్మరంగా చేపడుతున్న దాళ్వా పనులు



లచ్చిపాలెం పంచాయతీలో తడిచిన వరి పనలను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

తాళ్లరేవు: ఆరుగాలం శ్రమించి అందరికీ ఆహారాన్ని అందించే రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకపక్క ప్రభుత్వ నిర్లక్ష్యం, మరోపక్క ప్రకృతి వైపరీత్యాలు రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. అధిక వర్షాలు, వరదలతో ఎలాగోలా గట్టెక్కి పంట మాసూళ్లు పూర్తి చేసుకుంటున్నారు. తొలకరి ప్రారంభం నుంచి భారీ వర్షాలు వెంటాడాయి. ఒకవైపు వరద, మరోవైపు భారీ వర్షాలు కురవడంతో చాలా ప్రాంతాలలో వరిచేలకు నష్టం వాటిల్లింది. పంట దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి రావడమే కష్టంగా మారిందంటున్నారు. ఇలా ఉండగా చాలా ప్రాంతాలలో దాళ్వా పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. నారుమడులు వేయడంతో పాటు వరిచేలు దమ్ము చేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీని నెరవేర్చుకోకపోవడంతో సాయం కోసం రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు.

35 వేల ఎకరాల్లో సాగు

ముమ్మిడివరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 23వేల ఎకరాల్లో వరిపంట సాగు చేయగా, అమలాపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగు ప్రారంభంలో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. పీఎం కిసాన్ నిధులు అకౌంట్లలో జమ అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్పందించకపోవడంతో ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

రైతులు పంట సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 వెరసి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు అటవీ, దేవదాయ భూములను సాగు చేస్తున్న వారికి సైతం వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని గత ప్రభుత్వం అందించింది. అయితే కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో అన్నదాతల్లో అసహనం వ్యక్తమవుతోంది.

సత్వరమే సాయం అందించాలి



ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం తక్షణమే అందించాలి. దాళ్వా సాగు చేయాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లోనైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

పి.గోపాలరావు, రైతు, తాళ్లరేవు.

అధిక వర్షాలతో నష్టపోయాం



వరిసాగు ప్రారంభం నుంచి వర్షాలు అధికంగా కురవడంతో వరదల కారణంగా వరిచేలల్లో నీరు నిలిచిపోయి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలు నిరంతరాయంగా పడడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడింది. దీంతో పెట్టుబడి రావడమే కష్టసాధ్యమైంది. ప్రభుత్వమే ఆదుకోవాలి

అనిశెట్టి సూర్యనారాయణ రెడ్డి, రైతు, లచ్చిపాలెం.

మారిన వాతావరణం.. కర్షకుల కలవరం



ముమ్మిడివరంలో ధాన్యపురాశులను టార్పాలిన్‌తో కప్పిన దృశ్యం

ముమ్మిడివరం: సార్వా కోతలు ఆరంభం నుంచి వరుస తుపాన్లు, అల్ప పీడనాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా ఏర్పడిన మరో అల్పపీడనం ప్రభావంతో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు రైతులను కలవరపాటుకు గురి చేస్తోంది. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం వర్షం జల్లులు కురిశాయి. దీంతో ధాన్యాన్ని కాపాడుకోడానికి రైతులు నానా పాట్లు పడ్డారు. సార్వా కోతలు ఆరంభించిన నాటి నుంచి రైతులను వాతావరణం అడుగడుగునా భయపెడుతూనే ఉంది. వర్షాలకు పలు చోట్ల ధాన్యపురాశులు, బస్తాలు తడిచి పోగా ఆ ధాన్యాన్ని రైతులు ఎండ బెట్టుకుని అమ్ముకున్నారు. ఇప్పటికే 70 శాతం మంది రైతులు సార్వా ధాన్యం ఒబ్బిడి చేసుకోవడం, విక్రయించడం ద్వారా ఒడ్డున పడ్డారు. మిగిలిన రైతులు కోతలు కోసుకొని ఒబ్బిడి చేసుకుంటున్న తరుణంలో కురుస్తున్న జల్లులతో ఆందోళనకు గురవుతున్నారు. పుంత గట్లమీద ఎండబెట్టిన ధన్యాన్ని రాసులుగా చేసి బరకాలు, టార్పాలిన్లు కప్పారు. మరికొంత మంది ఆఘమేఘాల మీద ధాన్యాన్ని ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సుపరిపాలనతో గ్రామాభివృద్ధి



శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, అధికారులు

ముగిసిన సర్పంచుల శిక్షణ

అల్లవరం: తాగునీరు, రోడ్లు, డ్రెయిన్‌లను ప్రధాన అవసరాలుగా గుర్తించి ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో ఉండేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సుపరిపాలన సాధించేందుకు 9 లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. గ్రామాల్లో మాతా, శిశు మరణాలు లేకుండా చూడటం, పిల్లలందరికీ పౌష్టికాహారం, మహిళలకు భద్రత కల్పించాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సయన్వమంతో పని చేస్తే ఇది సాధ్యమేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, కడలి గంగాచలం, బొమ్మి బాలవేణి, వడ్డి సుభాషిణి, బర్రే సీతారత్నం, రాకాపు విజయలక్ష్మి, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, కార్యదర్శులు, వివిధ శాఖల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: సుస్థిరమైన గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు అన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు 9 అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ సుస్థిర గ్రామాభివృద్ధి ప్రణాళికలపై అవగాహన పెంచుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ మంగాదేవి, టీఓటీలు రాము, అనంతలక్ష్మిలు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు, సర్పంచ్‌లు జి.ఏసుబాబు, సీహెచ్.వెంకటేశ్వరరావు, కె.ప్రసన్న ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాబ్జిరాజు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఇమ్మిడివరప్పాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషోర్‌బాబు

అమలాపురం రూరల్: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ కిషోర్ బాబు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేలంగి దుర్గారావు, మాజీ సర్పంచ్ మందా గెద్దయ్య, రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

తాళ్లరేవు: భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇంజరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ముద్దన వెంకట శివ రామ ప్రసాద్ కోరారు. బుధవారం ఇంజరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ భూముల రీసర్వే కారణంగా పలువురు భూ యజమానులకు పలు ఇబ్బందులు వచ్చాయన్నారు. ఆయా సమస్యలకు సంబంధించి ఈ సదస్సులలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలతో పాటు ఇతర సమస్యలపై కూడా అర్జీలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పలు సమస్యలపై 15 అర్జీలు వచ్చినట్లు డీటీ తెలిపారు.

మహిళలు ఆర్థిక స్థితిమంతులుగా ఎదగాలి

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్



డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: మహిళలు ఆర్థిక సాధికారిత సాధించడం ద్వారా కుటుంబాలకు చేదోడుగా నిలవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం పుదుచ్చేరి అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో మహిళలకు డ్వాక్రా రుణాలు మంజూరు చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డ్వాక్రా ఋణాలను మళ్లీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటానని ఎన్నికల్లో మహిళలకు హామీ ఇచ్చానని ఇచ్చిన హామీని నిలుపుకున్నానని అన్నారు. ఒక్కో గ్రూపుకు ప్రస్తుతం ఇస్తున్న రూ.10 లక్షల ఋణాన్ని ఇంకా పెంచి రూ.20 లక్షల వరకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. 400 డ్వాక్రా గ్రూపులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా చెక్కులు, సంబంధిత పత్రాలను అందజేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉడా ప్రాజెక్టు డైరెక్టర్ శక్తివేలు, ఆర్ఏఓ మునిస్వామి, ప్రాజెక్టు ఆఫీసర్ జయంతి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె రామకృష్ణ, ఏసీఓ రమణ, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కిక్ బాక్సింగ్ పోటీలు

రాజోలు: ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఇంటర్ కొలిగేట్ టోర్నమెంట్ కిక్ బాక్సింగ్ పోటీలు బుధవారం ముగిశాయి. యూనివర్శిటీ పరిధిలోని సుమారు 12 కళాశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో 16 మంది విశ్వవిద్యాలయాల స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. ఓవరాల్ టీం చాంపియన్ షిప్‌గా మహిళా విభాగంలో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాల, పురుషుల విభాగంలో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు నిలిచాయి. పోటీలకు ఆదికవి నన్నయ యూనివర్శిటీ పరిశీలకుడిగా డాక్టర్ బి.రామ్‌గోపాల్, సభ్యులుగా డాక్టర్ బాపిరెడ్డి, సీహెచ్.సతీష్, రిఫరీలుగా అంజనీకుమార్, గిరిబాబు, భవానీ శంకర్‌లు వ్యవహరించారు. ప్రిన్సిపాల్ సాయిబాబు విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెందిన విద్యార్థులు రాజోలు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో గత రెండు రోజులుగా నిర్వహించిన కిక్ బాక్సింగ్ టోర్నమెంట్లో తమ కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సీహెచ్ పృథ్వీ రాజ్, కె.సతీష్‌లు (బంగారు), ఎం.వంశీ, కె.అనిల్‌కుమార్, పి.లక్ష్మీనారాయణలు (వెండి), బి.ప్రభాస్, బీఆర్‌డీ సాయికుమార్ (కాంస్య)పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పీడీలు కె.అంకమరావు, కె.కనకరాజు తదితరులు అభినందించారు.

వంతెన శిథిలం.. చర్యలు శూన్యం

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరంలో మేజర్ డ్రెయిన్‌పై వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనపై ఆధారపడి మండలంలోని సగానికి పైగా గ్రామాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చల్లపల్లి, కూనవరం, గోపవరం, సరిపల్లి, కిత్తనచెరువు గ్రామస్తులు మండల కేంద్రానికి రావాలన్నా, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి, ఎస్.కొత్తపల్లి, గాడవిల్లి, మునిపల్లితో పాటు కాట్రేనికోన మండలాల వాసులు అల్లవరం, అమలాపురం మండలాలకు చేరుకోవాలన్నా ఈ వంతెనే ప్రధాన ఆధారం. అనునిత్యం ఈ వంతెనపై వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పొంచి ఉన్న ముప్పును ముందుగా గుర్తించి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కూనవరంలో శిథిలావస్థకు చేరుకున్న వంతెన

రక్షా హరికృష్ణ చిరస్మరణీయులు



హరికృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి, తదితరులు

యానాం: మాజీ శాసన సభ్యులు, సేవా తత్పరుడు రక్షా హరికృష్ణ వర్ధంతిని బుధవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ రివర్‌బీచ్ లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. యానాం అభివృద్ధికే కాక వెనుకబాటుకు గురైన తీరప్రాంత మత్స్యకారుల జీవితాల్లో ఆయన వెలుగులు నింపారని కొనియాడారు. వారిని అన్ని రంగాల్లోను అభివృద్ధి చేసిన ఘనత హరికృష్ణకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, పీఆర్ ఏఓ కొల్లు ప్రసాద్, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణను విజయవంతం చేద్దాం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎంఓ రాంబాబు, కోర్స్ కోఆర్డినేటర్ రమణశ్రీ

ముమ్మిడివరం: పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ఉద్దేశించిన 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సులపై శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పిలుపు నిచ్చారు. దీనిపై గతేడాది సెప్టెంబర్‌లో జిల్లా వ్యాప్తంగా 132 మంది డీఆర్పీలకు శిక్షణ ఇచ్చామని వారి ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ట్రెనింగ్ సెంటర్‌ను ట్రెనింగ్ ప్రోగ్రామ్ కోర్స్ కోఆర్డినేటర్ బి.రమణశ్రీ,, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి. హనుమంతరావుతో కలిసి ఆయన సందర్శించారు. జిల్లాలో ప్రతి మండలం నుంచి ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులు, ప్రతి మండలం నుంచి గతంలో శిక్షణ పొందిన ముగ్గురు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈ శిక్షణలో పాల్గొంటారన్నారు.